క్లుప్తంగా

శిక్షణతో స్వయం ఉపాధి పొందాలి

సీతానగరం: కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలు, ప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్...

మక్కువ: మండల కేంద్రంలోని నక్కలవీధిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని ఈవో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం కాలనీ వాసులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం



జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. మేళాకు 76 మంది హాజరు కాగా, 58 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డా. ఉషశ్రీ తెలిపారు. ఎంపికైన వారికి ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ హెచ్‌ఆర్ రాజేష్, జేకేసీ కో ఆర్డినేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నత్తల నివారణపై దృష్టి సారించాలి

- వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి

పాలకొండ: నత్తల నివారణపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి సూచించారు. మండలంలోని సింగన్నవలసలో శుక్రవారం ఆమె పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తేమతో కూడిన వాతావరణలో నత్తల సమస్య ఉంటుందన్నారు. నత్తలు ఆకులు, కాండం, పువ్వులను తినడం ద్వారా పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని తెలిపారు. వీటి నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నత్తలు పొలంలో ఉంటే వాటిపై ఉప్పునీరు పిచికారీ చేయాలన్నారు. లేదా వెనిగర్, కాఫీ పొడిని పిచికారీ చేసినా ఫలితం ఉంటుందని చెప్పారు.

నిండుకుండలా నాగావళి


గోపాలపురం సమీపంలో నిండుకుండలా ప్రవహిస్తున్న నాగావళి నది

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. మరో రెండు రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలున్నాయన్న అధికారుల సూచనలతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే మండల పరిధిలో చిన్నమంగళాపురం, గోపాలపురం, అంపిలి, అన్నవరం, గొట్ట మంగళాపురం, యరకారాయపురం గ్రామాలను అనుకుని ఉన్న నదీ తీరాన్ని పరిశీలించిన ఎస్సై ప్రయోగమూర్తి శుక్రవారం తన సిబ్బందితో మారోమారు తీర ప్రాంతాలను పరిశీలించి ప్రజలను చైతన్య పరిచారు. ప్రవాహం తగ్గుముఖం పట్టే వరకు తీరంలో కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

పరామర్శ

భామిని: మండలంలోని లివిరికి చెందిన కమ్మరి లక్ష్మి (38) కొద్ది రోజుల కిందట వంశధార నదిలో గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, తదితరులు శుక్రవారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. లక్ష్మి జాడ తెలుసుకోవడంతో పాటు ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


ఏఈ సోమేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

వీరఘట్టం: విద్యుత్ శాఖ ఏఈగా కె.సోమేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బొబ్బిలిలో డీ–2 సెక్షన్ నుంచి ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన అనిల్‌కుమార్‌కు శ్రీకాకుళం బదిలీ జరిగింది. కొత్తగా వచ్చిన ఏఈకి సహచర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

వినాయకుడి లడ్డూ వేలంపాట

భామిని: మండలంలోని సొలికిరిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద శుక్రవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నాయకుడు బర్ల ఆనందరావు రూ. 24 వేలకు లడ్డూ దక్కించుకున్నారు.

- అధ్వానంగా పారిశుద్ధ్యం
- కాలువల్లో పేరుకుపోయిన మురుగు
- వీధుల్లో దర్శనమిస్తున్న చెత్త

టన్నుల్లో నిర్లక్ష్యం..
వీధుల్లో ప్రత్యక్షం


వైకేఎం కాలనీ పంచాయతీ పరిధిలో అంతర్ రాష్ట్ర రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పల్లో పందులు


బందలుప్పి ప్రారంభంలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు


కొత్తపట్నం ఎస్సీ కాలనీలో నీటినిల్వలపై ఏర్పడిన దోమలు

పార్వతీపురం రూరల్:

మండలంలోని గ్రామాల్లో ఉన్న వీధుల్లో పారిశుద్ధ్య లోపం తాండవిస్తూ సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతోంది. ఆరోగ్యమే మహాభాగ్యం, పచ్చదనం పరిశుభ్రత అని చెప్పుకోవడానికే తప్ప చేతల్లో శుభ్రత, ఆరోగ్య భద్రతకు చర్యలు కానరావడం లేదు. ఫలితంగా వీధులో పారిశుద్ధ్యం లోపం దర్శనమిస్తోంది. పార్వతీపురం మండలంలోని 27 పంచాయతీల్లో ఏ గ్రామంలో కూడా మెరుగైన పారిశుధ్య పనులు జరగడం లేదు. అయా గ్రామాలకు సంబంధించిన చెత్త సేకరణ కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిని ఏ మాత్రం వినియోగించకుండా గ్రామాల ప్రారంభంలో వీధుల కూడళ్లలో చెత్త నిల్వలు పేరుకుపోయి చిన్నపాటి డంపింగ్ యార్డుల్లా కన్పిస్తున్నాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్త, అలాగే ఇప్పటికీ కాలువలు నిర్మాణం కాక నీటి నిలవ్వలపై దోమలు విజృంభిస్తున్నాయి.

పర్యవేక్షణ చేస్తున్నాం

ఎప్పటికప్పుడు పంచాయతీల్లో పర్యటించి గ్రామాల్లో ఎక్కడైనా పారిశుధ్య లోపం సమస్య వస్తే తక్షణమే పర్యవేక్షిస్తున్నాం. సంబంధిత పంచాయతీ అధికారులకు ఎప్పటికప్పుడు మెరుగైన పారిశుధ్య పనులు చేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశిస్తున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో చెత్తసేకరణ కేంద్రాలు లేని నేపథ్యంలో వాటి నిర్మాణాలు చేపట్టేందుకు నివేదికలు అందించాం.

– కొండలరావు, డీపీఓ, పార్వతీపురం మన్యం జిల్లా


నర్సిపురం తెలకలవీధి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మళ్లీ గోడే కట్టారు...

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు


నూతనంగా నిర్మించిన రహదారిపై గోడ

పార్వతీపురం రూరల్: మండల పరిధిలోని జిల్లా కేంద్రం ప్రారంభంలో శక్తి నగర్ వద్ద ఉన్న కల్వర్టు గత చాలా కాలంగా శిథిలమై కారణంగా ఆ ప్రాంతంలో రోడ్డు విస్తీర్ణం కాస్త తగ్గి వాహనాలు రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పటికే ఎన్నోమార్లు అధికారులు కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు రూ.76లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ మేరకు పనులు కూడా ప్రారంభించి అర్థాంతరంగా నిలిపేశారు. అయితే ఒక పక్కన రహదారిపై కల్వర్టు కృంగిన ప్రదేశంలో ప్రమాదాలు జరగకుండా రహదారికి దాదాపుగా సగభాగం గోడను రక్షణగా నిర్మించారు. గోడ నిర్మాణం చూసిన వాహన చోదకులకు మరికాస్త భయాందోళన కలిగించి ఆదమరిస్తే గోడను ఢీకొట్టి ప్రమాదానికి గురికాక తప్పదంటూ ఆందోళన చెందుతున్నారు. ఇదే క్రమంలో గుర్తు తెలియని వాహనాలు ఆ గోడను ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యాయి. ఇప్పటికైనా పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావల్సిన అధికారులు మళ్లీ ఆ ప్రాంతంలో నూతనంగా గోడను నిర్మాణం చేసి చేతులు దులిపేసుకున్నారు. ఇంత ప్రమాదం పొంచివున్న సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురం రూరల్: ప్రైవేట్ ఎరువుల దుకాణాల యజమానులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదులు, ఆరోపణల మేరకు విజిలెన్స్ ఎస్ఐ రామారావు నేతృత్వంలో ఏవో అశోక్‌తో కలసి మండలంలో ఉన్న నర్సిపురం ఎరువుల దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేశారు. ఎరువులకు సంబంధించిన కొనుగోలు బిల్లులు, నిల్వలు పరిశీలించారు. అధిక ధరలకు అమ్మినా.. నిబంధనలు పాటించకపోయినా.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్వతీపురం పట్టణంలో కూడా ఈ తనిఖీలు నిర్వహించినట్టు వారు తెలిపారు. తనిఖీల్లో కన్నబాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తేనె కంటే తియ్యనైనది తెలుగు భాష


మక్కువ : కేజీబీవీలో తెలుగు భాష దినోత్సవం

మక్కువ: తేనె కంటే తియ్యనైనది తెలుగు భాష అని కాశీపట్నం కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జి.నాగదుర్గ అన్నారు. కేజీబీవీలో మాతృభాష దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా తెలుగు భాషాభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించిన గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే భారత హాకీ క్రీడాకారుడైన ధ్యాన్‌చంద్‌కు గౌరవ సూచకంగా ఆయన జయంతి సందర్భంగా జరుపుకుంటున్న క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: తెలుగు భాష దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష ప్రాధాన్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అందులో భాగంగా గేదెలపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత తెలుగుతనం ఉట్టిపడేలా వేషధారణలు చేయించి, తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యభద్రతకు తొలి ప్రాధాన్యం

పాలకొండ రూరల్: పలు కేసుల్లో నిందితులుగా ఉంటూ స్థానిక సబ్ జైల్‌లో ఖైదీల ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు జైల్ సూపరింటిండెంట్ బి.జోగులు అన్నారు. జైల్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఖైదీలు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన చర్యలపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు.

క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైన ఆదర్శ పాఠశాల

సాలూరు: పురోహితునివలస ఆదర్శ పాఠశాల జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైందని ప్రిన్సిపాల్ డా.అన్నా శామ్యూల్ లెంక తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతి ఏడాది అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లాలోని 5 ప్రభుత్వ పాఠశాలలకు ఈ అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. 2025 ఏడాదికి తమ పాఠశాల ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రవి మాట్లాడుతూ వరుసగా మూడో సారి క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

గాయత్రి ఎందరికో స్ఫూర్తిదాయకం


గాయత్రిని సన్మానిస్తున్న హెచ్‌ఎం టి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు

సాలూరు: అంతర్జాతీయ, జాతీయ, ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో విశేష ప్రతిభ కనబర్చిన కొరంపూడి గాయత్రి ఎందరికో స్ఫూర్తిదాయకమని వేద సమాజం సంస్కృతోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం–2025 సంబరాల్లో భాగంగా క్రీడల కోటలో పట్టణంలో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గాయత్రిను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాయత్రి స్వస్థలం విశాఖపట్నం కాగా పేదరికం నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి ఎదిగిందన్నారు. సౌత్ ఆఫ్రికాలో అంతర్జాతీయ బీచ్ గేమ్స్–2017లోను, వియత్నాంలో జరిగిన అయిదవ ఏషియన్ బీచ్ గేమ్స్–2016లోను, బంగ్లాదేశ్‌లో జరిగిన బీచ్ గేమ్స్–2013లోనూ కబడ్డీలో బంగారు పతకాలను ఆమె సాధించిందన్నారు. ఆమె కృషి పట్టుదలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలగడవలసలో వైద్య శిబిరం

మక్కువ: మండలంలోని తెలగడవలస గ్రామంలో శుక్రవారం ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ వైద్యాధికారి దోమాన శ్రీనివాసరావు 160 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన రోగులను గుర్తించి, విశాఖపట్టణంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరంలో గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థిని మృతి

పాచిపెంట: మూడో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని అకస్మాత్తుగా మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలు... మండలంలోని మూలవలస గ్రామానికి చెందిన కొట్టేసి భీమయ్య తమ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో తన కుమార్తె కొట్టేసి శాంతను చదువు నిమిత్తం వరసకు అన్న అయిన తుపాయిపాడు గ్రామానికి చెందిన కిరసాని సింగయ్య ఇంటికి పంపించాడు. శాంత అక్కడే ఉంటూ మూడో తరగతి చదువుతుంది. గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా అకస్మాత్తుగా మృతి చెందిందని మన్య సమాఖ్య ఆదివాసీ నాయకుడు పడాల తమ్మయ్య శుక్రవారం తెలిపారు.

బండరాళ్ల తొలగింపు


బండరాళ్లను తొలగిస్తున్న పోలీసులు

సీతంపేట: దోనుబాయి – పొల్ల మార్గంలోని ఘాట్ రోడ్‌లో బండరాళ్లను దోనుబాయి పోలీసులు శుక్రవారం తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపై నుంచి రాళ్లు రోడ్డుమీద పడడంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాళ్లను తొలగించి, పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం

- ఎస్పీ మాధవరెడ్డి


ఫిర్యాదుల విభాగాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పాలకొండ రూరల్: పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరిష్కరించే క్రమంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఎస్పీ ఎస్‌వీ.మాధవరెడ్డి అన్నారు. పాలకొండ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై నమోదైన కేసుల పూర్వాపరాలు, నేర పరిశోధన, తదితర అంశాలను డీఎస్పీ ఎం.రాంబాబును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న వసతులపై సీఐ మీసాల చంద్రమౌళి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాలతో పాటు దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. వినాయక నిమజ్జనాల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వివాదాలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్తరాంధ్రాలో ప్రఖ్యాతిగాంచిన స్థానిక కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల రవాణా, మత్తు పదార్థాలు, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. న్యాయం, రక్షణ కోసం స్టేషన్‌కు వచ్చేవారి పట్ల గౌరవభావంతో మెలగాలని సూచించారు. ఈయన వెంట ఎస్సై కె.ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.

కూరగాయల ధరలు పైపైకి..

- కూరగాయల సాగుపై వర్ష ప్రభావం
- తగ్గుముఖం పట్టిన దిగుబడులు
- ఆకాశాన్నంటుతున్న ధరలు
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు



పాలకొండ రూరల్: కొద్ది రోజుల కిందట విపరీతమైన ఎండలు.. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు.. ఈ ప్రత్యేకమైన వాతావరణం అన్ని రకాల పంటలపై పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయల రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల దిగుబడి ఘననీయంగా తగ్గింది. ఇదేక్రమంలో వరుస పండగల సీజన్ కావడం.. కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో కూరగాయల రైతులు దాదాపు 5 వేలకు పైబడి ఉన్నారు. సుమారు 11 వేల హెక్టార్లలో స్థానిక అవసరాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా కూరగాయలను పండిస్తుంటారు. పాలకొండ మండలంలో తుమరాడ, గరుగుబిల్లి, రుద్రిపేట, అంపిలి, ఓని గ్రామాల్లో చిక్కుడు, బెండ, కాకరకాయ, టమాటా, కొత్తిమీర, కరివేపాకు, బీర, మునగ, గోంగూర, అరటి, తోటకూర, బచ్చలకూర, ముల్లంగి, తదితర పంటలు సాగు చేస్తున్నారు. వీరఘట్టం మండలంలో కూడా అత్యధికంగా కూరగాయలను సాగుచేస్తుంటారు. అలాగే భామిని,సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల రైతులు కంది, కంద, జునుగులు, కొండ దబ్బకాయలు వంటివి పండిస్తున్నారు. అయితే ప్రస్తుత వాతవరణ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గిపోయింది. వర్షాలకు పంటలన్నీ నాశనమయ్యాయి. దీనికి తోడు సర్కారు నుంచి ఆశించిన సహకారం అందకపోగా బీమా ప్రీమియం కూడా రైతులే భరించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

దళారులదే పైచేయి..

ఎంతోకష్టపడి పంటలు సాగు చేస్తున్నా తమకు ఏమీ మిగలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు సిండికేట్ అవడంతో ధర పలకడం లేదని చెబుతున్నారు. కూరగాయలు, ఆకు కూరలను నిల్వ ఉంచే అవకాశం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులు అడిగిన ధరకు ఇవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధరలు బాగా ఎక్కువగా ఉన్నాయి. ఓ పక్క వినియోగదారుడు ధరలు చూసి భయపడుతున్నా.. రైతుకు మాత్రం ఏమీ రావడం లేదు.

వినియోగదారులు గగ్గోలు..

వరుస పండుగల నేపథ్యంలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. దిగుబడి తగ్గడంతో వారం రోజుల వ్యవధిలో అన్ని రకాల కూరగాయలపై కిలోకు రూ. 15 నుంచి 25 రూపాయల వరకు ధర పెరిగింది. వినియోగదారులు లబోదిబోమంటున్నారు.


గిట్టుబాటు కావడం లేదు..



రెండెకరాలు కౌలుకు తీసుకుని కూరగాయలు సాగు చేస్తున్నాను. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులకు దిగుబడి బాగా తగ్గింది. అధిక నీరు కారణంగా పురుగులు, క్రిమికీటకాలు ఆశించాయి. వచ్చిన దిగుబడి కనీసం పెట్టుబడికి కూడా రావడం లేదు. రైతుబజార్ లేకపోవడంతో దళారులకు అడిగి ధరకు పంట ఇవ్వాల్సి వస్తోంది.

– నెల్లి బాలు, కూరగాయల రైతు, గరుగుబిల్లి, పాలకొండ మండలం

కొనలేకపోతున్నాం..



తాజాగా పప్పు, ఉప్పు రేట్లు పెరిగాయి. వారం రోజులుగా కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజుకో ధర చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకూ రూ.20 లోపున్న టమాటా 50 రూపాయలకు చేరుకుంది. దిగుబడి తగ్గడంతో రైతుల నుంచి కూరగాయలు ఎక్కువగా రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయలు కొనలేకపోతున్నాం.

– బొత్స గౌరు, వినియోగదారు, పాలకొండ మండలం


సీతానగరం: రామవరంరెడ్డివీధిలో ఏనుగుపై అధిష్ఠించిన గణనాదుడు

పూజలందుకుంటున్న
గణనాథులు

వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయక విగ్రహాలు పలు రూపాల్లో రూపుదిద్దుకుంటే వాటికి నివేదించేందుకు సిద్ధం చేసిన ప్రసాదాలు కూడా పలు ఆకృతులు సంతరించుకుంటూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో ఎక్కడ చూసినా వినాయక చవితి త్రిరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


మక్కువ : వెంకటభైరిపురంలో గణనాథుడి పూజల్లో పాల్గొన్న భక్తులు


సీతానగరం: రామవరం బీసీ కాలనీలో నందివాహనంపై కొలువైన పార్వతీ తనయుడు


బలిజిపేట: వెంగాపురం వినాయక విగ్రహం వద్ద తయారైన శివలింగాకార ప్రసాదం